క్లుప్తంగా

మోటార్‌సైకిల్ చోరీ

కోట: రోడ్డుపై ఆపి ఉంచిన తన యమహా మోటార్‌సైకిల్ చోరీకి గురైందని కొత్తపాళేనికి చెందిన శివయ్య గురువారం ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశాడు. తాను తన మోటార్‌బైక్‌ను రోడ్డుపై ఆపి కల్లు గీసేందుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శరవేగంగా రోడ్డు మరమ్మతు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఈ గిరి మాట్లాడుతూ కై వల్యా వంతెన నుంచి రాపూరు రహదారి వరకు తాత్కాలిక మరమ్మతు పనులను చేస్తున్నామన్నారు.

చర్యలు తీసుకోవాలి

గూడూరు: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో ఈ మేరకు గురువారం ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ జిల్లా కమిటీ సభ్యుడు చిన్నా పాల్గొన్నారు.

సమాధుల తోట అభివృద్ధికి కృషి

గూడూరురూరల్: సమాధుల తోట అభివృద్ధికి సొసైటీ ఆధ్వర్యంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఇంటర్ డినామినేషనల్ క్రిస్టియన్ సెమెట్రి సొసైటీ అధ్యక్షుడు డానియేల్ పూలా రవికుమార్ తెలిపారు. గురువారం గాంధీనగర్‌లో ఉన్న క్రిస్టియన్ సమాధుల తోటలో గూడూరు ఇంటర్ డినామినేషనల్ క్రిస్టియన్ సెమెట్రి సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఆయన ప్రారంభించారు.

బదిలీ సాధారణం

గూడూరు: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది సర్వసాధారణమని, కానీ మనం పనిచేసిన చోట మంచి అధికారిగా పేరు తెచ్చుకుని వెళ్లాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న బీఆర్‌కే శివప్రసాద్ ఇటీవల తిరుపతి కలెక్టరేట్‌కు బదిలీ అయిన శివప్రసాద్‌కు వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయన్ని ఆర్డీఓతో పాటు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

ఉపాధిపనుల పరిశీలన

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని కామకూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ స్వరూపరాణి గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు.

అర్హులను గుర్తించాలి

వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, బాలాయపల్లి, డక్కిలి మండలాల పరిధిలో ఉన్న తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల వివరాలను సేకరణ వేగవంతంగా చేయాలని సీడీపీఓ శంషాద్‌బేగం తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో మిషన్ వాత్సల్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సైనికుల్లా పనిచేయాలి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): వైఎస్సార్‌సీపీ పటిష్టతకు సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ కార్యాలయం వద్ద గురువారం జగనన్నే మాభవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలపై సచివాలయం కన్వీనర్లకు అవగాహన కల్పించి కిట్లను పంపిణీ చేశారు. తాళ్లూరు వెంకట ప్రసాద్‌చౌదరి, వెందోటి కార్తీక్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


సంక్షేమాన్ని వివరించండి

ఓజిలి: సంక్షేమ పథకాల గురించి ఇంటింటా వివరించాలని జేసీఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. మండలంలో శుక్రవారం చేపట్టనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించి సచివాలయ కన్వీనర్లకు కరపత్రాల కిట్లను గురువారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు, నాయకులు దేసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, ముమ్మడి సుబ్బారావుయాదవ్ పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి

సైదాపురం: గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలని జేసీఎస్ కన్వీనర్, మాజీ ఎంపీపీ మన్నారపు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని సైదాపురం, లింగసముద్రం సచివాలయాలకు సంబంధించిన గృహ సారథులకు జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమం సామగ్రిని గురువారం అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, జనార్దన్‌రాజు, భాస్కర్, హరి, సాంబయ్య పాల్గొన్నారు.

రాములోరికి ప్రత్యేక పూజలు



నాయుడుపేటటౌన్: బజారువీధిలోని రామాలయంలో కోదండరాముడికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాములు కల్యాణోత్సవం అనంతరం జరిపే స్వామివారి పట్టాభిషేకంగా జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. అన్నదానానికి ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, టీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత తంబిరెడ్డి మోహన్‌రెడ్డి సోదరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఇక సాగిపో రయ్..రయ్



ఎస్ఎస్‌ఆర్ కాలనీ వద్ద ఉన్న రైల్వే గేటు

బండి..బండి.. రైలు బండి.. ఇది వేలకు రాదులేండి.. అన్న చందంగా ఆ కాలనీ వాసులు అత్యవసరమైనా.. ఆపదలో ఉన్నా.. రైలు గేటు దాటాలంటే రైలు వచ్చే సమయానికి ముందు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఆ తరువాత గేటు దాటాల్సి వస్తుందేది. ఆ సదుపాయం కూడా లేకుండా గేటు మూసివేతకు అధికారులు తీసుకున్న చర్యలను ఆ కాలనీ వాసులు అడ్డుకున్నారు. అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన చేసి, ఉన్నతాధికారులకు విన్నవించారు. ఎట్టకేలకు వారి మొరను రైల్వే అధికారులు ఆలకించారు. అండర్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో వారి దశాబ్దాల కల నెరవేరనుంది. ఇకపై తమ కాలనీ వాసులు రయ్..రయ్ అంటూ సాగిపోవచ్చని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- నెరవేరనున్న ఎస్ఎస్‌ఆర్ కాలనీవాసుల కల

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఎస్ఎస్‌ఆర్ కాలనీ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అధికారులు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు కొద్ది రోజుల కిందట రైల్వేశాఖ చెన్నై ఇంజినీరింగ్ అధికారులు స్థానిక తహసీల్దార్ రాజేంద్ర తదితర అధికారులతో కలసి కాలనీలో గ్రామసభ నిర్వహించారు. కాలనీ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని తీర్మానం చేశారు. ఎస్ఎస్‌ఆర్ కాలనీ రైల్వేగేటు వెనుక సుమారు 500 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. ఆ కాలనీలో సుమారు 2 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. కొద్ది నెలల కిందట కాలనీ వద్ద ఉన్న రైల్వేగేటు తొలగించి, గేటు లేకుండా చేసేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు వార్డు కౌన్సిలర్, స్థానిక పెద్దలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, గేటు తొలగించకుండా అడ్డుకున్నారు. ఈక్రమంలోనే రైల్వే అధికారులు కాలనీ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొద్ది రోజులు కిందట కాలనీలో గ్రామ సభ జరిపి గ్రామస్తుల అభిప్రాయం సైతం తీసుకున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో గ్రామసభ జరిపాం



ఎస్ఎస్‌ఆర్ కాలనీలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు కొద్ది రోజులు కిందట రైల్వే అధికారులతో కలసి గ్రామ సభ జరిపి, తీర్మానం చేశాం. రైల్వే అధికారులు వారి ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు చేపడతారు.

– రాజేంద్ర, తహసీల్దార్, నాయుడుపేట

ఆరోగ్యమే మహాభాగ్యంగా పాలన



సైదాపురం: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేసి వివరాలను తెలుపుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన సీఎంగా నిలిచిపోతున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాపమాంబపురంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి 104 వాహనానికి పచ్చాజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తుమ్మూరు మస్తాన్, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీపార్వతి, నాయకులు తంబిరెడ్డి శివారెడ్డి, గొడ్డటి రాజారెడ్డి, సిద్ధవరం కుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో సంతోషం

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో ప్రతి ఇంట సంతోషం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురం మండలంలోని గంగదేవిపల్లె, అనంతమడుగు అరుంధతీయవాడ, దళితవాడ, గంగదేవిపల్లె మెయిన్ గ్రామాల్లో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. గత ప్రభుత్వ పాలన, ఈ ప్రభుత్వ పాలన మధ్య తేడాను వివరించారు. లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నృత్య అకాడమి చైర్మన్ పొట్టేళ్ల శిరిషాయాదవ్, మాజీ ఎంపీపీ మన్నారపు రవికుమార్‌యాదవ్, సచివాలయ కన్వీనర్ జీ శివకుమార్, మున్నారపు సుధాకర్, సర్పంచ్ కుమారి, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణయ్య నేతలు ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, జనార్దన్‌రాజు, వైస్ ఎంపీపీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా స్నపన తిరుమంజనం



గజవాహనంపై ఊరేగుతున్న నరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారి వసంతోత్సవాల్లో చివరి రోజైన గురువారం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి కల్యాణ మండపంలో నిత్యహోమం, 10 గంటలకు స్వామి వారి నందనవనంలో లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి పాలు, తేనె, చందనం, పసుపు, పెరుగు, కొబ్బరి నారికేళ జలంతో అభిషేకించారు. రాత్రి ఉభయనాంచారులతో కలిసి గజ వాహనపై విహరిస్తూ స్వామివారు భక్తులను కటాక్షించారు. మహాపూర్ణాహుతి, కుంభజల ప్రోక్షణ నిర్వహించారు. దీంతో వసంతోత్సవాలు పూర్తయినట్టు అధికారులు పేర్కొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



పాపమాంబపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్‌ని ప్రారంభిస్తున్న ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి

సైదాపురం: నిరుపేదలకు ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలను అందించడం ఆనందంగా ఉందని వైస్ ఎంపీపీ భాస్కర్ కొనియాడారు. మండలంలోని ఊటుకూరులో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: సచివాలయం వద్ద గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతు సలహామండలి అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు గురువారం ప్రారంభించారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కోటపోలూరులో గురువారం ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీఓ చంద్రముని, నాయకులు బద్దెపూడి మోహన్‌రాజా రెడ్డి, సర్పంచ్‌లు అరుణ, ఎద్దల చిన్నరాజ పాల్గొన్నారు.

ఉప్పలమర్తిలో..

చిట్టమూరు: మండలంలోని ఉప్పలమర్తిలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని సర్పంచ్ నాగముంతల లావణ్య ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈశ్వరవాక పీహెచ్‌సీ వైద్యురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

బాలాయపల్లిలో.....

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ప్రారంభించారు. జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, మండల కన్వీనర్ బాపనపల్లి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాదేవి సురేష్, శేఖర్, వెంకటేశ్వర్లు, వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, ప్రమీల పాల్గొన్నారు.

విత్తన నాణ్యత అవసరం

వెంకటగిరిరూరల్: రైతులు పంటలు సాగుకు నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని పెట్లూరు, కె ఉప్పరపల్లె గ్రామాల్లో గురువారం క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, ఏఈఓ రామమొహన్, వీపీఏలు వరలక్ష్మి, సుమతి పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం చండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, మమత దంపతులతోపాటు వారి తండ్రి సన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన డాక్టర్ ఎస్వీ ప్రసాద్–అమృతవల్లి కుటుంబసభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపాల్, భైరి పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

కోట: మండలంలోని చంద్రశేఖరపురం వద్ద ప్రధాన రహదారిపై గురువారం రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కోటలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో పనిచేసే జగదీష్, వంశీ మోటార్‌సైకిల్‌లో గూడూరు నుంచి కోటకు బయలుదేరారు. నెల్లిపూడి గ్రామానికి చెందిన బాబు గూడూరు వైపు మరో మోటార్‌సైకిల్‌పై ఎదురుగా వస్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో జగదీష్, వంశీ, బాబు ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు వారిని కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటపై విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు.

విద్యార్థులకు టిఫిన్ సౌకర్యం

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గురువారం ఆ పాఠశాల హెచ్‌ఎం భానుమూర్తి టిఫిన్ సదుపాయం కల్పించారు. ఒంటి పూట బడులు నేపథ్యంలో ఈ నెలాఖరు వరకు పాఠశాలలోని 1, 2 తరగతుల్లోని 12 మంది విద్యార్థులకు తన సొంత నిధులతో టిఫిన్ అందించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

చేతిబోర్ల ఏర్పాటుకు వినతి

వెంకటగిరి: పట్టణంలోని పోలేరమ్మ గుడి వద్ద, బొగ్గులమిట్ట శ్రీరాముల గుడి వద్ద, ధర్మాపురం దళితవాడ శ్మశానం వద్ద చేతిబోర్లు ఏర్పాటు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యకు వినతి పత్రం అందజేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో పలు చేతిబోర్లు పాడైపోయాయని, విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని తెలిపారు. వాటి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల్లోకి తీసుకెళ్లాలి

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అందించే సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సచివాలయాల మండల కన్వీనర్లు వెదనపర్తి మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కడివేడు సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కిట్లను పంపిణీ చేశారు. కడివేడు ఎంపీటీసీ సభ్యురాలు దర్శిగుంట శైలజ, కమ్మవారిపాళెం సర్పంచ్ చిట్టేటి నారాయణ, గిద్దలూరు అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాపూరమ్మ జాతర

రాపూరు: గ్రామదేవత రాపూరమ్మ జాతర శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు దశాబ్దాల తరువాత అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ చేశారు. ఆలయం ప్రారంభం తరువాత 50 రోజుల పాటు పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతర నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం అభిషేకం, అంకురార్పణ, అమ్మవారి ఆహ్వానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శనివారం పూలంగిసేవ, అన్నదానం, గంగపెట్టి ఊరేగింపు, ఆదివారం గ్రామ పొంగళ్లు, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ



హరిబాబు మృతదేహం

కోట: మండలంలోని కొక్కుపాడు రోడ్డు, లింగాలస్వామి గుడి సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఉత్తమ నెల్లూరుకు చెందిన జంగిట హరిబాబు మృతి చెందాడు. ఎస్‌ఐ పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తమ నెల్లూరుకు చెందిన జంగిట హరిబాబు(38) రైతు కాగా పవర్ స్ప్రేయర్‌ను రిపేరు చేయించేందుకు తన కుమారుడు పవన్‌తేజను వెంటబెట్టుకుని బైక్‌లో కోటకు బయలుదేరాడు. అదేసమయంలో వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోట నుంచి ముత్తుకూరుకు వెళ్తూ ఎదురుగా వచ్చిన మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌బైక్ నడుపుతున్న హరిబాబు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా వెనుక కూర్చుని ఉన్న కుమారుడికి గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హరిబాబు మృతితో ఉత్తమ నెల్లూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్య రంగంలో పెను మార్పులు



చిల్లకూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిల్లకూరు: రాష్ట్రంలో వైద్యరంగంలో పెను మార్పులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని బల్లవోలులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూరుమూల పల్లెల్లోని పేదవారికి సైతం కార్పొరేట్ వైద్యం అందించేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలు చేశారన్నారు.

సిలికా తవ్వకాలతో భూములు ఛిద్రం

తీర ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఉన్న సిలికా గనుల్లో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో రైతులకు చెందిన భూములు ఛిద్రం అవుతున్నాయని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని బల్లవోలు, చింతవరం గ్రామాల మధ్య ఉన్న సిలికా భూములను గురువారం ఆయన రైతులతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ దువ్వూరు మంజులమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మార్లగుంట శైలజ, జెడ్పీటీసీ సభ్యులు మన్నెం శీనయ్య, నాయకులు మారంరెడ్డి అమరనాథ్‌రెడ్డి, దువ్వూరు చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు నెలవుగా గూడూరు



గూడూరు: విగ్రహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: దేశం కోసం త్యాగాలు చేసిన, పోరాడిన, మార్గ దర్శకులైన మహనీయుల విగ్రహాలకు ఏర్పాటు చేయడంలో గూడూరు ముందుందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్, మదర్ థెరిస్సా విగ్రహాలను ఆయన గురువారం పార్టీ నాయకులు మనుబోలు సతీష్‌రెడ్డి తదితరులతో కలసి పరిశీలించారు.

ఈ కార్యక్రమం చారిత్రాత్మకం..

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చారిత్రాత్మకమైనదని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. సొసైటీ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆక్రమణల తొలగింపుపై త్వరలో నిర్ణయం

కోట: బజారువీధిలో ఆక్రమణలు తొలగించి రోడ్లు వెడల్పు చేసే విషయమై అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. గురువారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో కలసి కోట బజారువీధిలో ఆక్రమణలను ఎమ్మెల్యే పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, నరమాల రమణయ్య, మొబీన్‌బాషా, మధుసూదన్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదిద్దాం



బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మనసారా ఆశీర్వదించి, రాష్ట్రంలో సుపరిపాలనను, రాష్ట్రాభివృద్ధిని కొనసాగించుకుందామని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం ఎగువచావలి, చెంబడిపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను పంపిణీ చేసి, లబ్ధిదారులకు ప్రభుత్వ పనితీరును వివరించారు. రెండు ఎకరాలతో రాజకీయ ప్రవేశం చేసిన చంద్రబాబు, ఎన్టీఆర్‌ను నమ్మించి వెన్నుపోటు పొడిచి చివరికి ఆయన చావుకు కారకుడైన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఆఖరికి నందమూరి వంశాన్ని పాతాళానికి నెట్టేయడమే కాకుండా 40 ఏళ్ల ప్రజలను మోసం చేస్తూ రూ.లక్షల కోట్లు దోచేశాడని ఆరోపించారు. అలాంటి చంద్రబాబుకు ప్రజలంతా కలిసి 2019లో బుద్ధి చెప్పినా మార్పు రాకుండా మళ్లీ కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మన జగనన్న పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. సర్పంచ్ శ్రీపతి ధనలక్ష్మి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ, పార్టీ మండల కన్వీనర్ మారా బత్తిన సుధాకర్, రఘునాయుడు, మద్దాల సోమశేఖర్‌రెడ్డి, చింతకాని మధుసూదన్‌నాయుడు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



విశేషాలంకరణలో సీతారాములు

గూడూరు: స్థానిక కోనేటిమిట్టలో ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణం కనుపండువగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు హోమం చేశారు. సాయంత్రం ఉభయకర్త, ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు, వందన దంపతుల చేతుల మీదుగా పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణలు, ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, కల్యాణోత్సవాన్ని వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్, ధర్మకర్తలు యూ పెంచలయ్య, డీ సురేంద్రబాబు, పీ సుబ్బయ్య, ఎన్ సుబ్బయ్య, అర్చకులు నారాయణ, సాయిపవన్ పాల్గొన్నారు.

రైతుల అభీష్టాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తాం

చిల్లకూరు: సాగరమాలకు సేకరించే భూములకు పరిహారం విషయంలో రైతుల అభీష్టాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తామని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ తెలిపారు. మండలంలోని చింతవరం సచివాలయంలో గురువారం స్థానిక రైతులతో సాగరమాల భూ సేకరణపై అభిప్రాయాలను తెలుసుకునేందుకు రైతులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సాగరమాల రహదారి నిర్మాణం కోసం భూములను సేకరిస్తున్నామని, ఇందులో భాగంగా చింతవరం పరిధిలో 70 మంది నుంచి 23 ఎకరాల వరకు సేకరణ చేస్తున్నామని చెప్పారు. ఎకరానికి ప్రభుత్వం రూ.11.60 లక్షలు పరిహారం అందించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలోనే 12 మంది రైతులకు నోటీసులు ఇచ్చేందుకు వచ్చి గ్రామసభ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డికి నివాళి





చెన్నుబాలకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం అరుణమ్మ

రాపూరు: ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి ఉత్తరక్రియలు గురువారం సంక్రాంతిపల్లెలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు పార్టీల నాయకులు, ఆయన అభిమానులు పాల్గొని, చెన్ను బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టుకూరు ధనంజయరెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన పట్టాభి రామిరెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.